క్లుప్తంగా

సాహిత్య పురస్కారానికి బ్రహ్మాచారి ఎంపిక



పాల్వంచ: కొండెపూడి సుబ్బారావు సాహిత్య పురస్కారానికి పాల్వంచకు చెందిన అచ్యుతానంద బ్రహ్మాచారి ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సాందీపని చరిత్ర పద్యకావ్య రచనకు గాను ఈ పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు. 2021లో వేణుమాధవ శతకానికి వేదుల చిరంజీవి సాహిత్య పురస్కారం, 2022లో శ్రీరామనాథ శతకానికి వేముల లక్ష్మీకాంతమ్మ సాహిత్య పురస్కారాలు అందుకున్నట్లు చెప్పారు.

ఓటర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

చుంచుపల్లి: మండలంలోని బాబూ క్యాంప్, ఎన్‌కే నగర్ గ్రామ పంచాయతీల్లో గురువారం ఓటు హక్కు వినియోగంపై కళాజాతా బృందాలు ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటుకు ప్రలోభపడకూడదని, నూటికి నూరు శాతం ఓటింగ్ నమోదు అయ్యే విధంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంద మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, కళాజాతా బృందం సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల ఆక్రమణ అడ్డగింత



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

చుంచుపల్లి: మండలంలోని 3 ఇంక్‌లెన్ పంచాయతీలో స్థానికులు కొందరు గురువారం డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి ప్రవేశించే ప్రయత్నం చేయగా రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఐ.మంగ్యా నాయక్ స్థానికులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరూ డబుల్ ఇళ్లను ఆక్రమించవద్దని, ఎన్నికల అనంతరం అధికారులతో మాట్లాడి అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతి, కార్యదర్శి పాష పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డాగా హెల్త్ సబ్‌సెంటర్



ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

జూలూరుపాడు: రాత్రివేళల్లో మందు బాబులకు హెల్త్ సబ్‌సెంటర్ అడ్డా మారింది. మండలంలోని పడమటనర్సాపురం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణంలో రాత్రి సమయాల్లో మందు బాబులు మద్యం తాగి ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాలను వదిలేసి వెళ్లడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆరోగ్య ఉపకేంద్రం ముఖద్వారం వద్దనే మందు బాబులు తాగిన మద్యం ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండారాలను చెల్లాచెదురుగా వేసి వెళ్లారు. ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం ఉదయం విధులు నిర్వహించేందుకు వచ్చిన ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఆందోళన చెందారు. దీనిపై పోలీసులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా పాత పోలీస్‌స్టేషన్ భవనం



పాత పోలీస్‌స్టేషన్ భవనం

సుజాతనగర్: మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ భవనం నిరుపయోగంగా మారింది. వైద్యశాఖకు చెందిన ఈ భవనాన్ని మొన్నటి వరకు పోలీస్ స్టేషన్‌గా వినియోగించారు. గతంలో ఈ భవనంలో సబ్‌సెంటర్, వైద్యసేవలు అందించారు. ప్రభుత్వాస్పత్రి నిర్మాణం జరిగిన తరువాత కొత్త మండలాల ఏర్పాటుతో పోలీస్‌స్టేషన్‌కు భవనం కావాల్సి వచ్చింది. దీంతో 2016 నుంచి 2023 వరకు ఈ భవనాన్ని పోలీస్‌స్టేషన్‌గా ఉపయోగించారు. ప్రస్తుతం సుమారు రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం కావడంతో ఈ భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం సుజాతనగర్‌లో ఆరోగ్య ఉపకేంద్రం లేకపోవడంతో సేవలకు ఇబ్బందిగా మారింది. పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆరోగ్య ఉపకేంద్రంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏజెన్సీవాసుల ఎదురుచూపు

పూర్వం నుంచి అదొక రహదారి. నేడు రెండు మండలాలను కలిపే అడ్డదారి. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో కాలక్రమేణా ఆ రహదారి కుంచించుకపోయి కాలిబాటగా మారింది. ప్రస్తుతం వేసవిలో మాత్రమే ప్రజలు దీనిని కాలిబాటగా వినియోగించుకుంటూ అడ్డదారిలో ఇల్లెందుకు చేరుకుంటున్నారు. ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై ప్రయాణించే వారు దగ్గరగా ఉంటుందని నేటికీ ఈ డొంకదారిలోనే ప్రయాణిస్తారు. రెండు మండలాలకు అడ్డదారి కావడంతోపాటు నియోజకవర్గ కేంద్రానికి ఏజెన్సీ గ్రామాలను దగ్గర చేసే ఈ డొంకదారి అభివృద్ధి కోసం ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇల్లెందు టు బోడు.. వయా ధర్మాపురం

- పది కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తే తగ్గనున్న 20 కిలోమీటర్లు
- బైపాస్ నిర్మాణంతో మేలు
- ఏజెన్సీ గ్రామాలకు దగ్గర కానున్న నియోజకవర్గ కేంద్రం



ధర్మాపురం నుంచి బోడుకు వెళ్లే రోడ్డు

ఇల్లెందురూరల్: ఇల్లెందు నుంచి ధర్మాపురం మీదుగా మక్కంపాడు, మక్కంపాడు తండా, ఎర్రాయిగూడెం, లాక్యా తండా మీదుగా బోడు చేరుకునే విధంగా రహదారి ఉంది. ఇల్లెందు నుంచి ధర్మాపురం వరకు ఏడు కిలోమీటర్లు ప్రస్తుతం బీటీ రోడ్డు వేసి ఉంది. అటవీ అనుమతుల కారణంగా కొద్దిదూరం మాత్రమే మట్టి రోడ్డు ఉంది. ధర్మాపురం నుంచి బోడు వెళ్లేందుకు కేవలం పది కిలోమీటర్లు. ధర్మాపురం నుంచి బోడు వెళ్లేందుకు మధ్యలో మక్కంపాడు, మక్కంపాడుతండా, లాక్యాతండా గ్రామాల ఉంటాయి. ఈ పది కిలోమీటర్ల దూరంలో నాలుగు చిన్న వాగులు మరియు పూజుగు వర్రె, ఏడు మెలికలవాగు, పాల వర్రె, పెద్దవాగు ఉన్నాయి. వర్షాకాలంలో వాగులు ప్రవాహంతో ఈ రోడ్డులో ప్రయాణించడానికి వీలుండదు. కేవలం వేసవిలో మాత్రమే బోడు, ఎర్రాయిగూడెం, లక్యాతండా, మక్కంపాడు, మక్కంపాడుతండా ప్రజలు ఈ రహదారి గుండా ఇల్లెందు చేరుకుంటున్నారు.

ఎనిమిది కిలోమీటర్లు నిర్మిస్తే చాలు..

ఇల్లెందు నుంచి ధర్మాపురం వరకు ఏడు కిలోమీటర్ల దూరం ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది. అందులో కొద్దిదూరం పెండింగ్‌లో ఉంది. ఇక ధర్మాపురం నుంచి బోడు వరకు పది కిలోమీటర్ల దూరంలో మక్కంపాడు స్టేజీ నుంచి బోడు వరకు ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఎనిమిది కిలోమీటర్ల దూరం రహదారి నిర్మాణంతోపాటు మధ్యలో వాగులపై చప్టాలు నిర్మిస్తే ఏజెన్సీ వాసులు నియోజకవర్గ కేంద్రానికి చేరుకునేందుకు దూరం తగ్గుతుంది. ప్రస్తుతం ఇల్లెందు నుంచి బోడు వెళ్లేందుకు 37 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అంటే ఇల్లెందు టు బోడు వయా ధర్మాపురం రహదారి ద్వారా కేవలం 17కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. ఈ రహదారి నిర్మాణం ద్వారా బోడు ప్రాంత ప్రజలకు 20 కిలోమీటర్లు ఆదా అవుతుంది. అంతేకాకుండా బోడు నుంచి ఇల్లెందు మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీకి కేవలం ఏడు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. అంటే మర్రిగూడెం గ్రామపంచాయతీ నుంచి అడ్డదారి ద్వారా ఇల్లెందుకు చేరుకునేందుకు 24 కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోతుంది. ప్రస్తుతం మర్రిగూడెం నుంచి ఇల్లెందుకు 34 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. మర్రిగూడెం ప్రజలకు కూడా పది కిలోమీటర్లు దూరం తగ్గినట్లవుతుంది. ఈ రహదారి స్వాతంత్ర్యం ముందు నుంచే ఉన్నందున అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ నుంచి కూడా ఎటువంటి ఆటంకాలు ఉండవని ఈప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

పూర్వం ఇదే ప్రధాన రహదారి...

దశాబ్దాల క్రితం సుదిమళ్ల సమితిగా ఉన్నప్పుడు ప్రస్తుత టేకులపల్లి మండలం బోడు ప్రాంత వాసులు ఈ రహదారినే వినియోగించుకుంటూ ఇల్లెందుకు చేరుకునేవారు. చాలామంది బోడు, ఎర్రాయిగూడెం, లాక్యాతండా గ్రామాలకు చెదిన ప్రజలు కాలినకడన వచ్చి ఇల్లెందులో చదువుకున్న సందర్భాలు ఉన్నాయి. రైతులు తమ ఉత్పత్తులను ఇల్లెందులో విక్రయించుకునేందుకు ఈ రహదారినే వినియోగించుకునే వారని పలువురు వృద్ధులు చెబుతున్నారు.



మార్గమధ్యలో అడ్డుగా ఉన్న పూజుగు వర్రె

పాతికేళ్ల క్రితం పునరుద్ధరణ పనులు...

ఇల్లెందు నుంచి బోడు గ్రామం వరకు రహదారి పునరుద్ధరణ ప్రాధాన్యం గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కాలిబాటను రహదారిగా మార్చేందుకు ప్రయత్నించారు. రహదారిని శుభ్రం చేసి గ్రావెల్ పనులు ప్రారంభించారు. కొంత దూరం నిర్మాణం జరిగింది. కానీ అదే సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ సుబ్బారావు మృతి చెందడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి రహదారి పునరుద్ధరణపై ఎవరూ దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం అధ్వానంగా మారింది.

రైతులకు మేలు జరుగుతుంది



ఇల్లెందు నుంచి బోడు వయా ధర్మాపురం రహదారి నిర్మించడం ద్వారా పూర్వం పెద్దలు వేసుకున్న రహదారికి మరోసారి రూపం తెచ్చినట్లవుతుంది. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించుకునే వీలు కలుగుతుంది. తద్వారా ఇల్లెందులో వ్యాపారాభివృద్ధికి ఈ రహదారి నిర్మాణం సహకరించినట్లవుతుంది.
– సందిరి రమేష్, మొంతోగు, ఇల్లెందు మండలం

బహుళ ప్రయోజనాలు



ఇల్లెందు నుంచి బోడు అడ్డ రోడ్డు నిర్మించడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. పల్లెల నుంచి నియోజకవర్గ కేంద్రానికి దూరం తగ్గుతుంది. విద్యార్థులు పట్టణానికి త్వరగా చేరుకునే అవకాశం ఉంటుంది. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువుల రవాణా భారం తగ్గుతుంది. ప్రయాణ చార్జీలు తగ్గుతాయి. – ముప్పారపు విష్ణు, లక్యాతండా, టేకులపల్లి మండలం

క్షేత్ర పరిశోధకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్



హాజరైన ఉపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం సెస్ పరీక్షపై అవగాహన, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 3, 6, 9వ తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషన్ ఎచ్యూవ్‌మెంట్ సర్వే (సెస్)పై పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థుల నైపుణ్యం, అభివృద్ధి, విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఎన్‌సీఈఆర్‌టీ – ఎస్ఈఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గిరిజన ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలతోపాటు, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు సెస్ పరీక్ష ఉంటుందన్నారు. కాకర్ల హెచ్‌ఎం, నోడల్ అధికారి సంజీవరావు, పాపకొల్లు హైస్కూల్ హెచ్‌ఎం మీరా సాహెబ్, రిసోర్స్ పర్సన్ పి.వెంకటేశ్వర్లు, కేజీబీవీ ఎస్ఓ పద్మజ, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, వై.వీరస్వామి, వీరన్న, వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరి, గీత, నాగజ్యోతి పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం బద్దుతండా పంచాయతీ మద్దిరాల తండాలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు కోరారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబుకు వినతిపత్రం అందజేశారు. వ్యాయామం, వాకింగ్ చేసేందుకు నిరుద్యోగులు దేహ దారుఢ్య పరీక్షల్లో రాణించేందుకు క్రీడా మైదానం లేక ఇబ్బందులు పడుతున్నామని, సత్వరమే మద్దిరాలతండాలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దినేష్, నరేష్, ప్రవీణ్, ప్రసాద్, సీతారాం, భద్రు, సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ

ఇల్లెందు: పరలోకానికి వెళ్లిన తమ కుటుంబ సభ్యులు, బంధువులను సమాధుల పండుగ రోజున కీర్తించటం క్రైస్తవుల ఆనవాయితీ. సమాధులను అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి పిల్లాపాపలతో ప్రత్యేక ప్రార్థనలు చేయటం ఈ రోజు ప్రత్యేకత. గురువారం ఇల్లెందు పట్టణంలోని బందెలమలయ్య కుంట, సింగరేణి బైపాస్ ప్రాంతంలో సమాధుల వద్ద సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు సమాధులను విద్యుత్ దీపాలు, కొవ్వొత్తులతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్మశానవాటిక విద్యుత్ దీపాల వెలుగులతో విరజిమ్మింది. ఈ ప్రత్యేక ప్రార్థనలకు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై పరలోకానికి వెళ్లిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు హాజరై సమాధుల వద్ద కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఇల్లెందురూరల్: మామిడిగూడెం గ్రామపంచాయతీ సుంకరగూడెం గ్రామంలో సమస్త పరిశుద్ధుల విశ్రాంతి దినం (సమాధుల పండుగ)ను క్రైస్తవులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిలువలో ప్రభువైన యేసుక్రీస్తు చనిపోయి మూడవ రోజున లేచినట్లు క్రైస్తవులు విశ్వసిస్తారు. మరణించిన వారు తప్పక తిరిగి లేచి క్రీస్తు రెండో రాకడ సమయంలో తీర్పు దినంలో పాల్గొంటారని క్రైస్తవుల విశ్వాసం. ఈ క్రమంలో సమాధుల పండుగను నిర్వహించి పూర్వీకులను జ్ఞాపకం చేసుకోవడం అనాధిగా వస్తున్న ఆచారం. కార్యక్రమంలో పాస్టర్లు డేవిడ్ రాజ్, లోకేష్‌రావు, దయానంద్, యోహాశివ, గ్రామపెద్దలు సబాస్టీన్, సూర్యప్రకాష్, ఇమ్మానియేలు, సృజన్, ప్రసన్న పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలోని క్రైస్తవులు గురువారం భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి, మాలపల్లి, పాతతండా, సులానగర్, కోయగూడెం, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, బోడు, ఆర్‌సిపేట, శంభునిగూడెం, ప్రిగళ్లపాడు, సంపత్‌నగర్ తదితర గ్రామాల్లోని క్రైస్తవులు సమాధుల వద్దకు వెళ్లి దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఇల్లెందులో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



టేకులపల్లి: సులానగర్‌లో..



ఇల్లెందురూరల్: సుంకరగూడెంలో..



ఇల్లెందులో ప్రత్యేక ప్రార్థనలు

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఇల్లెందు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్లను నేటి నుంచి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల స్వీకరించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి కాశయ్య తగు ఏర్పాట్లు చేశారు. గురువారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. మాట్లాడుతూ.. నామినేషన్ల స్వీకరణకు ఐదుగురితోపాటు మూడు వాహనాలను అనుమతించనున్నట్లు చెప్పారు. శాసనసభకు నామినేషన్ దాఖలు కోసం ఫారం 21 ఉచితంగా అందజేస్తామని తెలిపారు. రెండు ఫొటోలు అందజేయాలని, స్టాంప్ సైజు నామినేషన్ పేపర్ మీద అతికించాలని సూచించారు. నామినేషన్ డిపాజిట్ రూ.5 వేలు చెల్లించాలని, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థికి అదే నియోజకవర్గంలోని ఓటరు ఒకరు ప్రతిపాదించాల్సి ఉంటుందని తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రమణమూర్తి పక్కన సీఐ కరుణాకర్

ఎన్నికలకు సహకరించాలి: డీఎస్పీ

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున ప్రజలు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సహకరించాలని డీఎస్పీ రమణమూర్తి, సీఐ కరుణాకర్ కోరారు. పోలీసులకు శాంతిభద్రతల విషయంలో అన్ని వార్గలు సహకరించి ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసేలా చూడాలని కోరారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..



మాట్లాడుతున్న రవీంద్ర నాయక్

ఇల్లెందు: పోరాటాల పురిటిగడ్డ ఇల్లెందు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకొస్తున్నా ఆదరించండి.. అభివృద్ధికి పాటుపడతానని డి.రవీంద్ర నాయక్ అన్నారు. గురువారం ఇల్లెందు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లు ఈ ప్రాంతంలో వివిధ పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఒకే సర్కార్ ఉంటే ఏ పనైనా సులభంగా సాధించే అవకాశం ఉందన్నారు. ఇల్లెందును అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. అది బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా సాధ్యం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బలగానీ గోపీకృష్ణ, రాంచందర్ నాయక్, భట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాలకే యూనియన్ల మార్పు

పాల్వంచ: కొందరు స్వప్రయోజనాల కోసమే టీఆర్‌వీకేఎస్ నుంచి 327 యూనియన్‌లో చేరారని టీఆర్‌వీకేఎస్ 5, 6, 7 దశల రీజినల్ అధ్యక్షుడు తోట కోటేశ్వరరావు, కె.రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాధం రామకృష్ణ యూనియన్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని సంవత్సరం క్రితమే తొలగించామని, కరుణాకర్‌రెడ్డి అతని స్వార్థం కోసమే ఒక్కడే వెళ్లిపోయాడని, అతనితో ఎవరూ వెళ్లలేదన్నారు. తమ యూనియన్ నుంచి భారీగా వెళ్లిపోతున్నట్లు చేసిన ప్రకటనలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో రీజినల్ 7వ దశ కార్యదర్శి ముత్యాల రాంబాబు, 5, 6 దశల కార్యదర్శి ఎం.రమేష్, ఆర్.శ్రీనివాస్, ఎండీ.అమీన్, కోటిలింగం, మల్లెల వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఆర్‌వీకేఎస్ నాయకులు

బ్రేక్‌ఫాస్ట్ మార్గదర్శకాలు ఇవ్వండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

టేకులపల్లి: పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ అమలుకు జీఓ విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) నాయకులు కడుదుల వీరన్న, ఈసం నాగమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండల విద్యాశాఖాధికారి ఠాకూర్ రాంసింగ్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు ఏ అల్పాహారం పెట్టాలి, బిల్లులు ఎవరు ఇస్తారు, ఎంత ఇస్తారు అనే అంశానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు లేకుండానే అల్పాహారం చేయాలని హెచ్‌ఎంలు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పరిస్థితిలో బ్రేక్‌ఫాస్ట్‌లు ఎలా పెట్టగలమన్నారు. పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ అమలుకు అడ్వాన్స్ ఇవ్వాలని, ప్రతి విద్యార్థికి రూ.50 చెల్లించాలని, వంట పాత్రలు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈసం రాణి, మెట్ల సుశీల, మెట్ల మహేశ్వరి, మంగి పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాడుదాం..

ఇల్లెందురూరల్: పీడిత ప్రజల విముక్తి కోసం అమరులైన వీరుల ఆశయ సాధనకు పోరాడుదామని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాలలో గురువారం అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమరుల స్తూపాల వద్ద ఎర్రజెండా ఎగురవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సమస్యల పరిష్కార మార్గంలో ఎంతోమంది నేతలు, కార్యకర్తలు ఉద్యమంలో అసువులు బాసారని గుర్తుచేశారు. వారి ఆశయాల సాధన లక్ష్యంగా ప్రతిఒక్కరూ ఉద్యమబాటలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో సారంగపాణి, వెంకయ్య, మండల వెంకన్న, రాసాల లింగయ్య, నర్సింహారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎర్రజెండా ఎగురవేస్తున్న ఎన్డీ నాయకులు

మాయమాటలకు మోసపోవద్దు

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల సమయంలో స్థానికేతరులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోకుండా, స్థానికుడైన తనను గెలిపించాలని కొత్తగూడెం బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్ కోరారు. పట్టణంలోని 13, 14, 15వ వార్డుల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఏ సమస్య కూడా పరిష్కారం కాలేదని, తనకు ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, సాయి, గుడివాడ రాజేందర్, లీలా, కోమలి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మండలంలోని సుభాష్‌నగర్ సెంటర్‌లో రోడ్డు వెడల్పు పనులు జరగడంతో విద్యుత్ స్తంభం రోడ్డు మీదకు వచ్చింది. దీనిని తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఖమ్మం వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను ఇక్కడే నిలపడంతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - ఇల్లెందురూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రాము, ఏఈ, ట్రాన్స్‌కో ఇల్లెందు
సెల్ నెంబర్: 9440814145

